క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కొత్తపేట, విద్యుత్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు. 11కేవీ హనుమాన్‌నగర్, గొటేటి ఫంక్షన్‌హాల్, సాయినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ జైన్ మందిర్, కమలానగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఆత్మీయ సమావేశం


పారిజాతను అభినందిస్తున్న మహిళలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్ సాయినగర్–2లో సోమవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ మహిళలు ఆమెను ఘనంగా సత్కరించారు. పదవీ ఉన్నా లేకున్నా ప్రజలకు అండగా ఉంటానని పారిజాత పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మీశెట్టి మనోహర్, గిరిముదిరాజ్, భాను, కాలనీ కమిటీ సభ్యులు, మహిళలు ఉన్నారు.

క్రమం తప్పకుండా నీటి సరఫరా చేయాలని వినతి


మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

మీర్‌పేట: వేసవి దృష్ట్యా జిల్లెలగూడ ప్రాంతంలో రోజు విడిచి రోజు మంచినీటిని సరఫరా చేయాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు పోరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్ సోమవారం జలమండలి మేనేజర్ ప్రమోద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లెలగూడ పరిధిలోని సాయిరాంనగర్, ఓంకార్‌నగర్, బల్లారి రాఘవాకాలనీ, బీరప్పగడ్డ, కమలానగర్, వెంకటసాయి ఎన్‌క్లేవ్, బాలాజీ ఎన్‌క్లేవ్, దాసరి నారాయణకాలనీల్లో వారానికి రెండుసార్లు మాత్రమే నీరు సరఫరా అవుతోందని, వేసవి కావడంతో నీరు సరిపోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మేనేజర్‌కు వివరించారు. నాలుగు రోజుల్లోగా పైకాలనీలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేస్తామని మేనేజర్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఘనంగా స్వయంపాలన


విద్యార్థులకు జ్ఞాపికలు అందిస్తున్న ఉపాధ్యాయులు

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడిలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి ఆకట్టుకున్నారు. కాగా బోధనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు జ్ఞాపికలు అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న లచ్చిరెడ్డి

వనస్థలిపురం: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం నిర్వహించడం అభినందనీయమని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో వాసవి క్లబ్ వనస్థలిపురం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మల్లికార్జునరావు, శివనాగేశ్వర్‌రావు, విట్టా దూరయ్య, మురళీధర్‌గుప్త, శ్యాంసుందర్‌రావు, రాములు, శ్రీనివాసులు, సాయిమోహన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

వరదనీటి కాలువకు మోక్షమెప్పుడో?

- చెరువులు వెలిసినప్పుడే ఏర్పాటు
- శుద్ధమైన కాలువను మురికి కూపంగా మార్చిన ప్రజలు
- నిధులు మంజూరైనా మొదలుకాని నాలా పనులు


నాదర్‌గుల్‌లోని వరద కాలువలో పారుతున్న మురుగు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ అతిపెద్ద రెవెన్యూ కలిగిన విలేజ్‌గా గతంలో జిల్లాలోనే గుర్తింపు పొందింది. నాదర్‌గుల్‌కు సున్నం చెరువు దానిపైన అంతిరెడ్డి చెరువు, దేవలమ్మ చెరువు(ప్రస్తుతం ఆర్‌సీఐలో ఉంది) ఈ చెరువులు నిండినా, ఊటా ఏర్పడిన నాదర్‌గుల్‌లోని వరదనీటి కాలువ గూండా నీరు ప్రవహించి మాసబ్ చెరువులోకి కలిసేది.

మురుగు కాలువగా మార్పు..

ఊరు చిన్నదిగా ఉన్నప్పుడు వరదనీటి కలువగా ఉండి ఆ నీటిని పశు పక్ష్యాదులు సేవించేది. నేడు ఆ పరిస్థితి దాటిపోయింది. ఊరు కాస్త మున్సిపాలిటీ కార్పొరేషన్‌లో భాగమై భవన అంతస్తుల్లోకి వెళ్లిపోయి వ్యాపార, వాణిజ్య, విద్యాపరంగా అభివృద్ధి చెంది సుమారు వందకుపైగా కాలనీలతో మోడ్రన్ నాదర్‌గుల్‌గా ఏర్పడింది. కాని నాదర్‌గుల్‌కు అవుట్‌లెట్ అనేది లేకపోవడంతో ఈ మురుగునంతా వరదనీటి కాలువలోకి పంపిస్తూండడంతో ఇప్పుడు సమస్య జఠిలమైంది. అతిపెద్ద ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ, స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలు, వంశీధర్ సీబీఎస్ఈ స్కూళ్లు, వీటితో పాటు నాదర్‌గుల్ విలేజ్, హరిజనవాడ, గ్రీన్‌హోమ్స్ కాలనీ, గత కొంతకాలంగా ఏర్పడిన వందకుపైగా కాలనీల మురుగును తీసుకొచ్చి ఈ వరదకాలువలోనే కలుపుతుండటంతో ఇప్పుడు మురుగు కాలువగా మారింది.

గతంలో రూ.12 కోట్లు మంజూరు

ఈ కాలువను శుద్ధి చేసి ఆరు ఫీట్ల లోతు, ఏడు మీటర్ల వెడల్పుతో కాలువ పనులు పూర్తిచేసేందుకు గతంలో మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే సబితారెడ్డి చొరవ తీసుకొని రూ.12 కోట్లు మంజూరు చేయించింది. సామ యాదిరెడ్డి గార్డెన్‌లో ఇరిగేషన్ అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేసి పనులు మొదలుపెట్టాలని ఆదేశాలిచ్చింది. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ నాదర్‌గుల్‌కు చేరుకొని ఓపెన్ నాలాను పరిశీలించారు. పనులు మొదలు పెట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అయినా ఎక్కడ వేసిన గొంగడి మాదిరిగానే నాలా వెక్కిరిస్తూ ఉండిపోయింది.

రైతులకు ఇబ్బంది లేదు..
పనులు ఎందుకు సాగడం లేదో?

చెరువుల నుంచి వచ్చే వరదనీరు ఇప్పుడు మురుగునీరుగా మారిందనేది వాస్తవం. మెయిన్‌రోడ్డు మీదుగా ఇళ్ల మధ్య నుంచే ఈ నాలా వెళ్తుండటంతో దుర్వాసన భరించలేకపోతున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ కాలువ రైతుల పంటపొలాల మధ్య నుంచే పారుతోంది. రైతులు ఎవరూ అడ్డుపడడంలేదు. నాలా పనులు పూర్తి చేస్తే సంతోషమంటున్నారు. పనులు ఎందుకు సాగడంలేదో అంతుచిక్కడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మూడు కిలోమీటర్ల మేర..

బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల స్థానిక నాయకులు, ఇతర సంఘాలను కలుపుకొని అధికారులు సమన్వయంతో ముందుకుసాగితే నాలా పనులు జరిగే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ప్రజలు దుర్వాసనతో అల్లాడుతున్నారు. సుమారు మూడు కిలోమీటర్ల మేర పారి తుర్కయాంజాల్‌లోని మాసబ్ చెరువులోకి వెళ్తున్న ఈ కాలువకు మోక్షం కల్పించాలని స్థానికులు, కాలనీవాసులు అధికారులను కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించాలి



ఈ వరదనీటి కాలువలో మురుగునీరు కలవడంతో దుర్వాసన వస్తోంది. ఈ కాలువ పనులు ఎప్పుడో చేయాల్సి ఉండేది. రోజు రోజుకు ఈ కాలువలో మురుగునీటి ప్రవాహం పెరుగుతోంది. నిధులు మంజూరైనా అధికారులు పనులు చేపట్టడడం లేదు. వరద కాలువ పనులు మొదలుపెట్టి సమస్యను పరిష్కరించాలి.

–అంకంగారి మంజుల, మాజీ కౌన్సిలర్

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

మాజీ సర్పంచ్ గంగాపురం గోపాల్‌రెడ్డి


విజేత జట్లకు బహుమతులు అందిస్తున్న మాజీ సర్పంచ్ తదితరులు

కందుకూరు: క్రీడాకారులను గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని తిమ్మాపూర్ మాజీ సర్పంచ్ గంగాపురం గోపాల్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో టీపీఎల్ సీజన్–10 పేరుతో గత జనవరి 12 నుంచి గ్రామ పరిధిలో చేపట్టిన క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంకు హాజరైన ఆయన మాట్లాడారు. క్రీడలతో స్నేహభావంతో పాటు శారీరక, మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. కాగా ప్రథమ స్థానంలో నిలిచిన రాజస్థాన్ రాయల్స్ జట్టుకు గ్రామానికి చెందిన వట్నాల శేఖర్‌గౌడ్ రూ.41వేల నగదు అందించారు. ద్వితీయ స్థానంలో నిలిచిన డక్కన్ చార్జెస్ జట్టుకు సన్నిళ్ల నర్సింహా రూ.30వేల నగదు, తృతీయ స్థానంలో నిలిచిన ఆర్‌సీబీ జట్టుకు అరిగె రమేశ్ రూ.15వేల నగదును అందించగా నిర్వాహకులు విజేతలకు ట్రోఫీలు అందించారు. కాగా పోటీలో పాల్గొన్న అన్ని జట్లకు రూ.5వేల చొప్పున నగదును మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో నాయకులు మంద యాదగిరి, సన్నిళ్ల పవన్, పున్న జ్ఞానేశ్వర్, దొడ్డె భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ సహాయ కేంద్రం ఏర్పాటు

మున్సిపల్ కమిషనర్ వాణి


పుర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రం

తుక్కుగూడ: తుక్కుగూడ మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ చెల్లింపుపై సందేహాలు, సలహాల కోసం సహాయ కేంద్రం(హెల్ప్ డెస్క్)ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సహాయ కేంద్రాన్ని సందర్శించి, మాట్లాడారు. గతంలో చేసిన అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించడానికి 2020లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తును స్వీకరించామన్నారు. ఈ దరఖాస్తును ప్రభుత్వం గత కొద్ది రోజుల నుంచి క్రమబద్ధీకరిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈ దరఖాస్తుల్లో ఉన్న ఫీజులో 25 రాయితీ లభిస్తుందన్నారు. మార్చి 31వరకు ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. అవకాశం ఉన్న ప్లాట్ల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలు కోసం పుర కార్యాలయంలో సహాయ కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్

ఎల్‌బీనగర్: ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు రంగం సిద్ధం అయ్యిందని, అందులో భాగంగానే ఎల్‌ఆర్‌ఎస్ లబ్ధిదారులతో సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జీఓ 28 ప్రకారం గతంలో చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించనున్నట్లు ఆయన వెల్లడించారు. లే అవుట్‌లో 30 ఫీట్ల రోడ్డు, 10 శాతం ఓపెన్ ప్లేస్ ఉండాలని, ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. దరఖాస్తుదారులు ఎల్ఎస్ఆర్ ఫీజు ముందే వసూలు చేయకుండా 10 శాతం వసూలు చేసి మిగతా 90 శాతం ఫీజు దరఖాస్తు పరిశీలించిన తర్వాత తీసుకోవాలని లబ్ధిదారుడు నర్సిరెడ్డి కోరగా స్పందించిన అధికారులు పరిశీలిస్తామన్నారు. ఓపెన్ ప్లేస్ ఫీజు 10 శాతం ఓనర్స్ నుంచి వసూలు చేయాలని కొంతమంది అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. లబ్ధిదారుల అభ్యంతరాలను పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ శ్రీనివాస్‌యాదవ్, రంజిత్‌కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ సామ్సంగ్, ప్రతాప్, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

వరద సమస్య లేకుండా చేస్తాం


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

చైతన్యపురి: వరదనీటి కాలువ నిర్మాణంతో కాలనీలలో వేధిస్తున్న సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తున్నామని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. డివిజన్‌లోని ప్రభాత్‌నగర్ కాలనీ నుంచి గంగా ఆసుపత్రి రోడ్డు వరకు రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న వరదనీటి కాలువ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు తవ్వకాలు జరిపి అభివృద్ధి పనులు పూర్తి చేసిన వెంటనే రోడ్డు పాచ్‌వర్కు పనులు చేపడితే కాలనీ ప్రజలకు ఇబ్బందులు రాకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రత్నసాయి, స్థానిక నాయకులు రుద్రారపు శంకర్, వినోద్‌యాదవ్, నవీన్‌యాదవ్, కులదీప్, వెంకటరమణ, కాలనీవాసులు రాజగోపాల్, నర్సింహరావు, రవికుమార్, సతీష్, అంజయ్య పాల్గొన్నారు.

5న ముదిరాజ్‌ల కృతజ్ఞత సభ

మహేశ్వరం: ముదిరాజ్‌ల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి గుండెమోని అంజయ్య ముదిరాజ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ.. దేశంలో ఏ రాష్ట్రాల్లో లేని విధంగా బీసీల కులగణన చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. బీసీ సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో బీసీల కులగణన జరిపి ముదిరాజ్ కులస్తులే అత్యధికంగా జనాభా కలిగి ఉందని తేల్చిందన్నారు. బీసీల కులగణన చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ముదిరాజ్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ నెల 5న బుధవారం ఉదయం 10 గంటలకు తొండుపల్లి, శంషాబాద్ ఎంఎస్ గార్డెన్‌లో సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు ప్రతి ముదిరాజ్ నాయకుడు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సులు

చైతన్యపురి: తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణకు దిల్‌సుఖ్‌నగర్‌లోని హైదరాబాద్–2 డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ నెల 12న రాత్రి 7.15 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి బయలుదేరి కాణిపాకం, గోల్డేన్ టెంపుల్ మీదుగా అరణాచలం చేరుకుంటుందని తెలిపారు. 14న మధ్యా హ్నం బయలు దేరుతుందని ఒకొక్కరికి టికె ట్ రూ. 3900 ఉంటుందని బుకింగ్ కోసం టీజీఆర్టీసీ వెబ్‌సైట్ ద్వారా లేదా 99592 26249, 9346559649, 9666350995 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధి హైకోర్టు కాలనీలోని వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో స్వామి వారి షష్ఠమ వార్షిక బ్రహ్మోత్సవాలను మంగళవారం నుంచి గురువారం వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బి.శ్రీనివాస్, ఆలయ కమిటీ అధ్యక్షులు పి.వెంకటేశ్వర రావు, కార్యదర్శి టి.నాగరాజు, కోశాధికారి బి.సత్యనారాయణమూర్తి తెలిపారు. మూడ్రోజుల పాటు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రధానంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన ఫిర్యాదులే అధికంగా రావడం విశేషం.ఐదు సర్కిళ్ల పరిధిలో 13 ఫిర్యాదులు రాగా టౌన్ ప్లానింగ్ విభాగంలోనే 5 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. మిగతా వాటిలో ట్యాక్స్ విభాగంలో 5, శానిటేషన్, ఇంజినీరింగ్ విభాగాలపై ఒక్కొక్కటి వచ్చాయన్నారు. ఫిర్యాదులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

పది పరీక్షలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోటివేషనల్ ట్రైనర్ లింగరాజు

మహేశ్వరం: పరీక్షలు భయం లేకుండా నిర్భయంగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని మోటివేషనల్ ట్రైనర్ లింగరాజు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తుమ్మలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల ఏవిధంగా రాయాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువును కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని పెట్టుకొని పట్టుదలతో ముందుకెళ్తే జీవితంలో అనుకున్నది సాధించవచ్చన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని సూచించారు. అంతకుముందు పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి కటికల యాదగిరి, ఉపాధ్యాయులు మాధవరెడ్డి, యాదగిరి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి


వినతిపత్రం ఇస్తున్న సంక్షేమ సంఘం నాయకులు

చైతన్యపురి: చైతన్యపురి రెండవ బస్టాప్ నుంచి ఎల్‌వీ టవర్స్ వరకు సివరేజీ లైన్ మంజూరు కాగా బాబు కాంప్లెక్స్ వరకే పనులు పూర్తయ్యాయని మిగిలిన 100 మీటర్ల లైన్ త్వరగా పూర్తి చేయాలని కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు వినతిపత్రం ఇచ్చినట్లు అధ్యక్షుడు మల్లే కృష్ణమూర్తి తెలిపారు. అసంపూర్తి పనులతో తరచూ రోడ్లపై డ్రైనేజీ నీరు ప్రవహిస్తుందని రోడ్డు నంబర్–18బీలో సివరేజీ లైన్ నుంచి మురుగునీరు బోర్‌వెల్ వాటర్‌లో కలిసి కలుషితమై అనారోగ్య బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే రోడ్డులో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అవసరమైన చోట్ల రబ్బర్ స్పీడ్ బ్రేక్స్ వేసేందుకు కాలనీ సంక్షేమ సంఘానికి అనుమతి ఇవ్వాలని కోరామన్నారు.

మసీద్ ఆవరణలో ఇబ్బందులు లేకుండా చర్యలు


డ్రైనేజీ సమస్య విషయమై స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మసీద్‌ల పరిసరాలలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. ఎర్రకుంటలోని ఉమర్ ఫారూఖ్ మసీద్ వద్ద డ్రైనేజీ నుంచి మురుగునీరు పారుతున్న విషయమై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన సమస్యను స్వయంగా పరిశీలించారు. పక్కనే ఉన్న హోటల్ నుంచి మురుగునీరు, వ్యర్థాల పారబోత కారణంగానే డ్రైనేజీ పైప్‌లైన్లు నిండి పూర్తిగా రోడ్లపైనే పారుతుందని స్థానికులు వివరించారు. పవిత్ర రంజాన్ మాసంలో మురుగునీటి నడుమ నడవాల్సి వస్తుందని తెలిపారు. హోటల్‌కు సంబంధించిన వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లో రోడ్లపై పడేయరాదని నిర్వాహకులకు సూచించారు. మసీద్ ముందు రహదారి కూడా దెబ్బతిన్న దృష్ట్యా, వెంటనే మొరం పోసి ఇబ్బందులు లేకండా చూస్తామన్నారు. సమీపంలో ఉన్న నాలా పైకప్పుపై అక్రమంగా ఏర్పాటు చేసిన చెప్పుల డబ్బాను కూడా తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

మాజీ సర్పంచ్ పరిగి చంద్రశేఖర్‌రెడ్డి


పనులను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు

మహేశ్వరం: గ్రామాభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని దిలావార్‌గూడ మాజీ సర్పంచ్ పరిగి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని దిలావార్‌గూడ గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే సబితా రెడ్డి సహకారంతో గ్రామంలో మరిన్నీ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. అంతకుముందు గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కోళ్లపడకల్ ఎంపీటీసీ మాజీ సభ్యుడు హన్మగళ్ల చంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ బండ శేఖర్, గ్రామస్తులు బండ కుమార్, నర్రె శ్రీశైలం, బండ భాను, స్వామి, యాదయ్య, శేఖర్ పలువురు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా


అధికారులతో చర్చిస్తున్న కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయనగర్‌కాలనీలో సోమవారం ఆయన అధికారులు, కాలనీవాసులతో కలిసి పర్యటించారు. కాలనీలో చెత్తకుప్పలు పేరుకపోతున్నాయని శానిటేషన్ అధికారులు చెత్తపై దృష్టి సారిండం లేదని, రోడ్లు, మంచినీటి పైప్‌లైన్లు, డ్రైనేజీ, పార్కుల అభివృద్ధి, పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు తదితర సమస్యలను కాలనీవాసులు కార్పొరేటర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలోని సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట వాటర్ వర్క్స్ డీజీఎం రాజగోపాల్, ఇంజినీరింగ్ ఏఈ రాజ్‌కుమార్, కాలనీ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సోమిరెడ్డి, నాయకులు శ్రీధర్‌రావు, మహేష్‌గౌడ్, శానిటేషన్ జవాన్ యాదయ్య, ఎస్ఎఫ్ఏ పురుషోత్తం, శ్రీకాంత్ ఉన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పేదలకేనా?


మాట్లాడుతున్న అందోజు రవీంద్రాచారి

హయత్‌నగర్: ప్రభుత్వ నిబంధనలు కేవలం పేదలకే వర్తిస్తాయా..? పెద్దలు తప్పు చేస్తే శిక్షలుండవు.. చర్యలుండవు.. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు తమ వైఖరిని స్పష్టం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు అందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. హయత్‌నగర్ మండల పరిధిలోని సర్వే నెంబర్ 255లో అసైన్డ్ భూములను పార్టీ ఎల్‌బీనగర్ కన్వీనర్ సామిడి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా రవీంద్రాచారి మాట్లాడుతూ.. హయత్‌నగర్ మండల పరిధిలోని అన్మగల్ సర్వే నెంబర్ 255లో 75 ఎకరాల భూమిని సాగు చేసుకునేందుకు ప్రభుత్వం పేద రైతులకు అసైన్డ్ చేసిందన్నారు. సదరు భూమిలో రైతులు తమ ఆర్థిక అవసరాలకు పేద, మధ్య తరగతి కుటుంబాలకు 40 నుంచి 70 గజాల వరకు విక్రయాలు చేశారు. కొనుగోలు చేసిన పేదలను తమ ప్లాట్లలోకి వెళ్లనివ్వకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఇదే సర్వే నెంబర్‌లో పలుకుబడి ఉన్న నేతలు స్థలాలను కొనుగోలు చేశారని, వాళ్లను రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతూ పేదల కొనుగొలు చేసిన స్థలాలకు నిబంధనలు అంటూ అడ్డుకుంటున్నారని విమర్శించారు. పేదలకు అండగా ఉంటూ న్యాయం జరిగే వరకు సీపీఐ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహా, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.